


# పరదేశీ కథలు

– చిట్టే సిద్ధ లలిత



- 119 –

## ఎండమావి

**ఆ ఎడారి దాహంతో** అలమటించి పోతోంది. నీళ్ళు కావాలి. మనిషి దాహంతో పరుగులు పెడుతున్నాడు.

డబ్బు కావాలి. మనిషి దాహానికి రూపాయలు సరిపోక విలువైన దినారాల కోసం ఎండమావుల వెంట పరుగులు తీస్తున్నాడు. అందుకోసం రెక్కలు కట్టుకుని సముద్రాలు దాటి ఎడారి సీమలకు ఎగిరిపోతున్నాడు.

దినారాల మోజులో బంధాలను మర్చిపోతున్నాడు. డబ్బుకోసం పరిగెత్తే మనుషులను చూసి ఎడారి నవ్వుకుంటోంది.

"ఒరేయ్ పృధ్వీ! ఒక్కసారి ఇంటికి రారా..! నిన్ను చూడాలని మీ అమ్మ తపించిపోతోంది. ఆరేళ్ళయింది ఇంకా కోపమేంట్రా. పోనీలే నీకు ఇష్టమొచ్చిన పెళ్ళి చేసుకున్నావు. సంతోషంగా వున్నావు. అది చాలు.మొదట్లో మాకు కోపం వచ్చిన మాట నిజమే. ఇప్పుడు పోయింది కదా.

మనుషులన్నాక కోపతాపాలు సహజమే. అంత మాత్రాన బంధాలను తెంచేసుకుంటామా. నీ మొండి పట్టుదల విడిచి పెట్టి మనవళ్ళను అయినా తెచ్చి మాకు చూపించు. నీ మీద దిగులుతో మీ అమ్మ చచ్చిపోయేట్లు వుందిరా పృధ్వీ.

నా మాట విని నీ పంతం మాని ఇండియాకు రా. వచ్చి మా కళ్ళకు కనపడి మీ అమ్మ ప్రాణాలు నిలబెట్టు" అంటూ అర్థిస్తున్నాడు శ్రీనివాస్.

మౌనంగా వింటున్నాడు పృధ్వి. తండ్రికి జవాబు ఇవ్వలేదు.

చివరికి ఆ తండ్రి హృదయం కరిగి కన్నీరుగా మారింది. అయినా చలించలేదు పృధ్వి. నిమ్మకు నీరెత్తినట్లు తనకు సంబంధం లేని విషయమన్నట్లు బదులు పలకలేదు. వాడి హృదయాన్ని మార్చడం తనకు సాధ్యం కాదని తెలిసిపోయినట్లుంది.

దు:ఖాన్ని దిగమింగుకుని ఫోను పెట్టేసాడు శ్రీనివాస్.

"ఏమంటున్నాడు వాడు?" ప్రశ్నించింది భార్య కమలమ్మ నీరసంగా.

"ఏమీ అనడు. వాడు మూగవాడయ్యాడు. చెవిటి వాడయ్యాడు. మొండివాడయ్యాడు. మూర్ఖుడయ్యాడు. ఏం చెప్పమంటావు" అన్నాడు దిగులుగా శ్రీనివాస్.

"తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుడు పుట్టనేమి వాడు గిట్టనేమి" అంటూ నిట్టూర్చింది కమలమ్మ.

"ఆ శ్రీలంక పిల్ల వీడిని పూర్తిగా మార్చేసి తన చెప్పుచేతల్లో పెట్టుకుంది. కన్న తల్లితండ్రులనే మరిపించి దూరం చేసింది. ఎంతకాలం ఆ మత్తులో వుంటాడో చూద్దాం" చెప్పాడు శ్రీనివాస్.

"మరి వాడి చదువుకోసం, కువైట్ వెళ్ళడంకోసం చేసిన అప్పులు వాటికి వడ్డీలు కుప్పలా పెరిగిపోతున్నాయి కదా. వాడి సుఖం వాడు చూసుకున్నాడు. శ్రీలంక పిల్లను పెళ్ళి చేసుకోవద్దురా అన్నందుకు మనపైన కక్ష కట్టాడు వాడు. ఫోను చేస్తే ఎత్తుతాడు కానీ ఉలకడు పలకడు. వాడిని కని పెంచి పెద్ద చేసి ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఆ శ్రీలంక పిల్ల వల్లో వేసుకుని మనకు దూరం చేసింది. ఏం మందు పెట్టిందో ఆ మహాతల్లి వాడికి ఇంటి మీద మనమీద ధ్యాస లేకుండా చేసింది. ఒక్కగానొక్క కొడుకు. ఏం చేద్దాం, ఏ దేవుడితో మొర పెట్టుకుందాం" ఏడ్చింది కమలమ్మ.

"ఇక వున్న పొలం అమ్మడం తప్ప గత్యంతరం లేదు. అప్పు కట్టకపోతే కోమటి శెట్టి ఒప్పుకోడు" తీర్మానించాడు శ్రీనివాస్.

పొలం అమ్మాలి అనే మాట వినగానే విలవిల్లాడింది ఆమె. ఏంటో ఈ ప్రాణం పోతే బావుండు అంటూ బాధపడింది.

"నువ్వు ఆ ముసలివాళ్ళని పూర్తిగా మర్చిపోవాలి హనీ. ఆరోజు మర్యాదగా మన పెళ్ళికి ఒప్పుకుని వుంటే మనం వాళ్ళను గౌరవించేవాళ్ళం. శ్రీలంక పిల్ల వద్దు మీ మామ కూతురిని చేసుకో అని రొద పెట్టారుగా. ఇప్పుడు వాళ్ళ చావు వాళ్ళని చావనీ. వాళ్ళు చచ్చినా నువ్వు ఇండియా పోవడానికి వీల్లేదు. మనం కెండిలో ఇల్లు కొనుక్కుని శ్రీలంకలో సెటిల్ అవుదాం" అల్టిమేటం జారీ చేసింది సూర్యప్రభ.

"అలాగే డార్లింగ్" అంటూ బుద్ధిగా తలూపాడు పృధ్వి.

సూర్యప్రభ అల్ ముల్లా కరెన్సీ ఎక్స్ఛేంజ్ కంపెనీలో మేనేజర్ గా పని చేస్తోంది. అదే కంపెనీ వేరే బ్రాంచ్ లో పృధ్వి అకౌంటెంట్ గా చేస్తూ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. పరిచయం ప్రేమగా మారడం పెళ్ళికి దారి తీయడం జరిగింది. కానీ పృధ్వి తల్లితండ్రులు శ్రీలంక అమ్మాయిని చేసుకుంటే ఒక్కగానొక్క కొడుకు దూరమవుతాడని భయపడ్డారు. వద్దన్నారు. వీళ్ళు వినలేదు. ఇద్దరూ శ్రీలంక వెళ్ళి సూర్యప్రభ తల్లితండ్రుల సమక్షంలో పెళ్ళి చేసుకున్నారు.

"మా వాళ్ళు మంచివాళ్ళు కాబట్టే వప్పుకున్నారు. మీ వాళ్ళకు నీపైన ప్రేమ లేదు వాళ్ళతో మాట్లాడకు" అని చెప్పింది సూర్యప్రభ.

నిజమే అనుకుని అమ్మనాన్నల మీద కోపం పెంచుకున్నాడు పృధ్వి. నాలుగేళ్ళలో ఇద్దరు పిల్లలు కూడా పుట్టుకొచ్చారు.

ఈ లోపల వీళ్ళ కోపం తగ్గి మెత్తబడి అయిందేదో అయింది అనుకుని కొడుకుకు కాల్ చేసి మాట్లాడాలని ప్రయత్నించినా వాడు ఉలకడు పలకడు. మనవళ్ళను చూడాలి అందరూ రండి అన్నా కూడా చలించడు.

పక్కన సూర్యప్రభ "హనీ ఆ ముసలి వాళ్ళతో నువ్వు మాట్లాడకు" అంటుంది. కువైట్ లో వున్న బంధువులను కొడుకు దగ్గరికి పంపించి చెప్పించారు. అయినా వాడి మనసు కరగలేదు.

సూర్యప్రభ ప్రభావం వాడి మీద పూర్తిగా వుంది. ఆ మత్తులో మునిగి వున్నాడు పృధ్వి.

ఇక్కడ శ్రీనివాస్, కమలమ్మ కృంగిపోతున్నారు. కొడుకును కువైట్ పంపించి తప్పు చేసామా అని తల బాదుకుంటున్నారు.

కాలం ఒక్కోసారి గమ్మత్తులు చేస్తుంది. అనూహ్యమైన ఘటనల ద్వారా వేదనాభరిత హృదయాలకు మరమ్మత్తులు చేసి ఊరడిస్తుంది. అదే జరిగిందిక్కడ.

ఆ నెల ఆడిటింగ్ లో సూర్యప్రభ పనిచేసే ఎక్చేంజ్ కంపెనీలో 50 వేల దినారాలకు పైగా డబ్బు తక్కువున్నట్లు తేలింది. సూర్యప్రభ లెక్కల్లోనే ఆ తేడాను వారు గుర్తించారు.

దొంగతనం సూర్యప్రభ మీద మోపి  పోలీసులు అరెస్ట్ చేసి సంకెళ్ళు వేసి తీసుకెళ్ళారు. గల్ఫ్ దేశాల్లో చట్టాలు కఠినంగా వుంటాయి.

చేసిన తప్పుకు శిక్ష అనుభవించాల్సిందే. సడన్ గా జరిగిన ఈ ఘటనకు షాక్ కు గురయ్యాడు పృధ్వి.

ఇంట్లో ఇద్దరు చిన్నపిల్లలు. వాళ్ళని ఎలా సంబాళించాలో తెలియదు. సూర్యప్రభను అందరూ దొంగ అంటున్నారు.

తలెత్తుకోలేకున్నాడు పృధ్వి. ఆ ప్రభావం పృధ్వి పైన కూడా పడింది.

భర్తకు తెలియకుండా ఈ పని జరుగుతుందా? ఇద్దరూ కలిసే దినారాలు దోచేసి దాచేసారు అనే పుకార్లు, మాటలు చెవిన పడటంతో కృంగిపోయాడు.

దీనికి తోడు పృధ్విని కూడా పోలీసులు పిలిచి ఇంటరాగేషన్ చేసారు.

దొంగ అనిపించుకోవడం ఎవరికైనా అవమానమే. డబ్బుతో వ్యవహారం. పెద్దమొత్తంలో జరిగింది కావున సూర్యప్రభకు ఎన్నేళ్ళు శిక్ష పడుతుందో తెలియదు. బహుశా యావజ్జీవమే కావచ్చు.

ఇక జన్మలో ఆమె మొహం చూసే అవకాశం లేదు. కొందరు "నువ్వు అమాయకుడివి నీకేమీ తెలియదు.

సూర్యప్రభ దొంగతనం చేసి ఆ డబ్బును శ్రీలంకకు పంపించింది ఇప్పుడు నిన్ను కూడా అరెస్ట్ చేస్తే నీ బ్రతుకు కటకటాల వెనకే తెల్లారుతుంది" అనే మాటలు చెప్పి భయాన్ని రేకెత్తిస్తున్నారు.

పృధ్వికి పిచ్చి పట్టినట్లు అయింది. చిన్నపిల్లలతో ఊపిరి ఆడటం లేదు. వీటికి తోడు జరిగిన విషయాన్ని దృష్టిలో వుంచుకుని ఆ ఎక్చేంజ్ కంపెనీ పృధ్వీని ఉద్యోగం నుండి తీసేసింది. కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది పరిస్థితి.

పిల్లల్ని చూసుకునే వాళ్ళెవరూ లేరు. వాళ్ళకు ఏమి అమర్చి పెట్టాలో తెలియడం లేదు.

దొంగతనం చేసిన సూర్యప్రభపైన మొదటిసారి కోపం వచ్చింది. ఆ కోపం ఇక పోయేది కాదు.

"నువ్వు ఇక్కడే వుంటే సూర్యప్రభతో పాటూ నిన్నూ అరెస్ట్ చేస్తారు. వారికి అనుమానం రాకముందే ఇండియాకు పారిపోయి తలదాచుకో. నువ్వు జైలుకు పోతే పిల్లలు అనాధలవుతారు" అని ఫ్రెండ్స్ సలహా ఇచ్చారు.

బెంబేలెత్తిపోయాడు పృధ్వి. గత్యంతరం లేదు పిల్లల్ని తీసుకుని ఇండియాకు పారిపోవడమే శరణ్యం అని భావించాడు. అనుకున్నదే నిజమయ్యింది. కువైట్ కోర్టులో సూర్యప్రభే దొంగతనం చేసిందని రుజువయ్యింది.

"పరదేశంలో భయం లేకుండా ఎంతపని చేసింది సూర్యప్రభ. ఛ తనని నమ్మి పెళ్ళి చేసుకుని ఎంత పొరపాటు చేసాడు! ఒయాసిస్ అనుకున్నాడు కానీ చివరికి ఎండమావి అని తేలింది. తనకోసం తల్లితండ్రులను బాధపెట్టాడు."

పిల్లల్ని తీసుకుని ఇండియా ఫ్లయిట్ ఎక్కుతుంటే తల్లితండ్రులు గుర్తొచ్చి కన్నీళ్ళొచ్చాయి. అన్నీ బావున్నపుడు ఎంత అహంకారంతో ప్రవర్తించాడో గుర్తొచ్చి బాధపడ్డాడు.

"సూర్యప్రభ శాశ్వతం అనుకున్నాడు. సర్వస్వం అనుకున్నాడు. కానీ ఆమె అసలు స్వరూపం ఇదా..! ఎందుకు చేసింది ఇంత పని.! ఇప్పుడు అమ్మేదని అడిగే పిల్లలకు ఏం జవాబు చెప్పాలి? వీళ్ళను ఎలా పెంచాలి?" సతమతమవుతూ ఇంటికి వచ్చాడు పృధ్వి.

ఎలాంటి స్థితిలో అయినా తిరిగొస్తే బిడ్డను అక్కున చేర్చుకునేది తల్లితండ్రులు. స్వాగతం పలికేది మన నేల.

తప్పులను అయినవాళ్ళు తప్ప పరాయివాళ్ళు క్షమించరు. కొడుకును మనవళ్ళను చూసి సంతోషించారు శ్రీనివాస్ కమలమ్మ.

"కోడలు రాలేదా?" అని అడిగారు.

"రాలేదు" అని ముభావంగా జవాబిచ్చాడు పృధ్వి.

ముక్కుపచ్చలారని మనవళ్ళను దగ్గరికి తీసుకుని ముద్దాడింది కమలమ్మ. ఆ పిల్లలు మరలా తమ తల్లిని చూస్తారా కలుస్తారా అనేది కాలమే నిర్ణయించాలి.

ఏదో వింత జరిగితే తప్ప సూర్యప్రభ కువైట్ జైలు నుండి విడుదల అవడం ఇంటికి రావడం అనేది అసాధ్యమే మరి.

చిన్నగా విషయం తెలిసాక కువైట్ లో సూర్యప్రభ చేసిన నిర్వాకం విన్నాక శ్రీనివాస్, కమలమ్మ నివ్వెరపోయారు.

అమ్మానాన్నలకు నమస్కరించి క్షమించమని వేడుకున్నాడు పృథ్వి.

"అయిందేదో అయింది సూర్యప్రభ ఇక తిరిగిరాదు కాబట్టి ఇప్పుడైనా మీ మామ కూతుర్ని చేసుకోరా పిల్లల్ని చూసుకుంటుంది" అని నచ్చచెప్ప సాగింది కమలమ్మ.

కాలం ఎవరికోసమూ ఒకచోట ఆగదు. జీవితం కూడా అంతే అదొక ప్రవాహం. సముద్రాన్ని చేరేవరకూ ముందుకు సాగిపోవాల్సిందే.

(మరోకథ వచ్చేనెలలో)

Post your comments